# పతనం

రచన: కె. వీరభద్రాచారి.

నిజానికి ... చుట్టం చూపుగా ఊరికివచ్చిన వాసుదేవరావు — 2,3 ఏళ్ల నుండి ఊళ్ళోనే పనిచేస్తున్న పంతులమ్మ లలిత ఒకేరోజున ఆ పెద్ద వీధిలో కనిపించకపోవటం ... కొంతసంచలనం కలిగించకపోలేదు ... పట్టణంకాని పల్లెకాని అవ్వాళ్ళో ఈసంచలనం ఎన్నోరకాల కథలుగా అవతరించింది ... లలిత ఏమయిందో కొన్నాళ్ళు చూచి ... బడిలో కుర్చీ ఖాళీగా ఉంచకూడదనే నిశ్చయించుకొన్నారు అధికారులు, ఆమె అందరియందూ చూపిన మంచితనం, ఆమె తెలివి, సౌందర్యం ... కొన్నాళ్లు ఖాళీగానే ఉంచగలిగాయి ... తరువాత లతాదేవి స్వీకరించింది ... ఆస్థానాన్ని ...

స్వాగతమిస్తూ లతాదేవితో - హెడ్ మిస్ట్రెస్ లలితమంచితనాన్ని ప్రశంసిస్తూనే — ఈ సంఘటనంతా చెప్పింది. లలిత అనగానే లతకు తన కాలేజి జీవితం జ్ఞాపకం వచ్చింది —. ఒకవేళ లలితే ఏమో? కాని ఈ విచిత్రం! ఆమె సంతకాన్ని చూచింది ... నిజమే! తన లలితే! అబ్బా! ఎన్నాళ్ళకు చూడగలిగింది లలితచేతి అక్షరాలను? కాలేజీలో పరీక్షలయిన కొద్ది నెలలలోనే లలిత ప్రపంచంలో — తన జీవితంకోసం — యుద్ధం చేయవలసి వచ్చిందిగా! ఆ తర్వాత ఆమెనుండి లేఖలే లేవు తనకు ... కొంత సంతోషం ... జాలి ... అన్నీ కనపడ్డాయి లలిత ముఖంలో. కాలేజీ గర్ల్స్ హాస్టల్ లో లలిత లతలది ఒకే గది. ఆ రెండేళ్లు ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకొన్నారు. వ్యక్తుల భావాలలో భేదాలు; లోపాలు తెలుసుకొన్నారు. తాను అర్థం చేసుకొన్నంతవరకూ లలితలోని ఈ మార్పును సమన్వయించుకోలేకపోతుంది లత. దూరం ఆలోచించింది. తమ మధ్యజరిగిన సంభాషణలు జ్ఞాపకం చేసుకొంది. వ్రాసినలేఖలు చదివింది ... ఉన్నతమైన ఆమె ఆశయాలన్నీ ఏమైనాయ్ అనుకొంది. ఆమె ఆశ్చర్యం, ఆ కథలల్లిన ఆ వూరి రచయితలకుమల్లే, ఆమె నైతికంగా పతనమైందని కాదు— ఆమె సౌందర్యం ప్రశంసించి ... ఎంతైనాత్యాగం చేస్తామన్న యువకులెన్నాళ్లన్నా స్నేహితులుగానే ఉండిపోయినా, పరిచయమైనాలేని ఎవరో యీ వాసుతోనా ఈ సంఘటన జరిగిందని!

ఆదివారం లత తన గదిలో కూర్చొని ఆలోచిస్తోంది ... తనీవూరువచ్చిన నాటినుంచీ ఆలోచనలన్నీ లలితమీదే కేంద్రీకరించుకొన్నాయి. కాలేజీలో హాస్టలు గది బాగా జ్ఞాపకం వార్డెన్ తమమైత్రినిచూచి గదితలుపుమీద 'లలిత లత' అని వ్రాసింది.

ఎన్నోసార్లు లలిత సౌందర్యానికి తను అసూయపడడంకూడా జరిగేది. మరి రఘూ మేగజీన్‌లో వ్రాసిన "అందాలరాకుమారి" గేయం లలితనుద్దేశించేగా? తామిద్దరూ మేడమెట్లెక్కి పోతుంటే—ఆ Genius రామం—తన డబల్ బ్రెస్ట్ కోటు సర్దుకుంటూ లలిత అందాన్ని తాగుతూ నడిచేగా మెట్లకింద పడింది? వీరందరికీ తెలుసు లలిత అనాఘ్రాతపుష్పం అని—కాని వితంతువనికూడా. ఆమె విజ్ఞానం, ఆమె ఆశయాలు ఆమెను మరింత ఆకర్షణీయంగాచేసినా, లతకు తెలుసు ఆమెనిగ్రహశక్తినికూడా హెచ్చించాయని. తానువివాహం చేసుకోకుండా ఉండగలననే విశ్వాసం లేకపోయినా తనశరీరంమీద, హృదయంమీద ఏ యువకుడికి అధికారం వుంటుందో చర్చించేది లతతో. అప్పుడప్పుడూ—ఎలాగైనా వీధిలోని అనధికారవార్తలనుబట్టి లలిత చర్యను లత అభినందించ లేకపోయింది—వాసుదేవరావునుగూర్చి తాను విన్నవార్త మరీ జాలికలిగిస్తుంది...ఆ ఉదయమే ఆమె తెలుసుకొంది...ఆ వూరిలోనూ—మెరకవీధి... టెంపిల్ స్ట్రీట్ లాంటి వీధి ఒకటి ఉందని...ఆవీధిలో వారందరూ...వాసు అక్కడ వున్నప్పుడు ప్రతి సాయంత్రం దర్శించేవారని......

చిన్నచిన్న చినుకులు...అస్తమించే సూర్యుని ఎర్రని కిరణాలతో ఎన్నో యింద్రధనుస్సులను తయారుచేస్తున్నాయి...ఆలోచిస్తూనే ఎదుటి కిటికీలోంచి దూరాన—పచ్చని—ఎత్తైన—చెరుకుతోటలు—ఆమధ్య వికృతంగా నిలిచిఉన్న దిష్టిబొమ్మలు చూస్తూనిలుచుంది లత...ఇంతలోనే అంతరాయం కల్గించింది కిటికీలోంచిపడ్డ కవరు. అది లలితనుంచే అయి వుంటుంది !

'లతా...

నాపదవి నీవు స్వీకరించినందుకు సంతోషం. మొదట నాలోమార్పుకు నీవు అర్థంఅడిగితే నీకు తృప్తి కలిగించేట్టు చెప్పలేనేమో అని విచారిస్తున్నాను... కారణందాని అర్థంనాకే సరిగా తెలియదుగనక.

'వాసును నేను మొట్టమొదటిసారి చూడడం, నేను రావడానికి పూర్వం 10 రోజులక్రితం మాత్రమే—ఆ వేళ ఆదివారం—తలంటిపోసుకొని ఆరిన జుట్టు చిక్కుతీసుకొంటూ ఏవోఆలోచనలతో రోడ్డుకేసి చూస్తున్నా—పొడవైన ఈ విగ్రహం ఎదుట సాక్షాత్కరించింది "నారింజకు నీరువోయు అభ్యంగనమంగళాంగి" అనవ్వుతున్న పెదవులమధ్య రాగంతో వినిపించింది...నిజానికి నావాసులోని ఏదో సౌందర్యం, కళ్ళల్లోని మెరుపు అప్పుడే ఆకర్షించాయినన్ను. అయితే యిది వరకు నామిత్రుల ఫోటోలలో యింత అందమైంది లేదా అనిమాత్రం అడగకు. లోపలికిపోయి అద్దంలో చూచుకొన్నా. ముఖమెలా ఉన్నా జుట్టుమాత్రం ఆరి మన నాగావళి ఒడ్డున—కెరటాల గుర్తులతో సన్నని యిసుకపొరలు ... వుదయాన్నే సూర్యకిరణాలు ఒక్కొక్క రేణువు ఒక అద్దంలా ప్రతిఫలిస్తుంటే

మాష్టారే అలావుంది......మళ్లామరునాడు ...ఆమరునాడొక లేఖ... చాలసార్లు చదువుకొన్నా...ఆవేళసాయంత్రం ఆశైమ్‌కు కొద్దిముందే లాడ్జి తాళంవేసి బయ ల్దేరా...అతనిని కలుసుకొందామనే అప్పుడే నాలో ఏదో విచిత్రప్రకృతి విజృంభిం చింది. నది ఒడ్డున ఇసుకలో కూచున్నా. మాటల్లోనే సూర్యుడు ఎర్రబడటం... చంద్రుడు తెల్లబోవటంకూడా జరిగింది. అప్పుడే నేనూ నాహృదయం అతనికి మరింత దగ్గరైనాం—అంతే—ప్రస్తుత జీవితం హాయిగా గడుపుతున్నాం—

'నావయసు ముందుకు జరిగేకొద్దీ నాలోనూ...వాంఛలు మొలకెత్తాయి. నాఆశయాలకు తగినవరుని అన్వేషించ లేనని నాకుతెలుసు. ప్రకృతి నాలో నా హృదయంలో ఎంతో వుద్రేకం కల్గించింది. ఆపూరిసుందర వాతావరణం, నదీతీరాన నా ఒంటరితనం, నావిద్యార్థినులే మాతృత్వాన్ని అనుభవించడం అతనిలోని ఏదో ఆకర్షణ మొదలైన ఎన్నో కారణాలు——"ముగించింది లత...నవ్వుకొంది... జాలిపడింది...

తర్వాత ఇంకా ఎన్నో ఉత్తరాలు—ఆపైని ఒక ఆహ్వానం లలితకు కొడుకు ...బాలసారకు రమ్మని...ఎన్నాళ్లకో కలుసుకొన్న స్నేహితురాండ్రిద్దరూ చాలా ఆనందించారు. ఎన్నో విషయాలు కథలుగా ఎంతసేపో చెప్పుకొన్నారు — లత వివాహం; కాపరం; మొదలైనవి ఏన్నో!

లలితమాత్రం ఇదివరకులా ఉత్సాహంగా లేదు. కారణం అడగకుండా ఉండలేకపోయింది లత. లలితకళ్లనుండి వెచ్చని బిందువులు రాలాయి — వాసుదే వరావు ధనికుడు, కుటుంబానికి ఒక్కడే. అందగాడే —! సంఘం, సాంప్రదా యం ఎదిరించి లలిత అతనిని చేరింది — తను కోరాడు. — మొదట్లోతనకు ఆమె స్వప్నసుందరి ... కనీసం అతని మాటలన్నీ నిజమైతే ఆమెకోసం ఏమైనా త్యా గం చేస్తాడు. యిద్దరూ ఎంతోసుఖం అనుభవించారు — ఆనందపు ఎల్లలు దాటేము అనేవాడు అతను. —ఎన్నాళ్ళనుండో అనుభవించ వలసిన సౌఖ్య మంతా ఆకలితో — అనుభవించింది లలిత — ఒక ఏడాదిపైన కొన్నిమాసాలు గడిచాయి అట్లనే — వాసు స్వభావంలో కొంత తేడా విసువు చూపించిందిఆమె. కాని ఆమెఆశయాలు, కారణం దొరక్క కలతపడనీయలేదు. లలితకు తనసౌంద ర్యం కల్గించే ఆకర్షణలో విశ్వాసం పోతోంది. — ఇంట్లో మార్పులు వచ్చాయి. కొన్నాళ్లలోనే కార్యేషుదాసీ గానే నిలిచింది ఆమె —వాసులోని వింత ప్రకృ తులు రూపం తీసుకొంటున్నాయి — లలిత యవ్వనంలో ఒంటరిగా గడపడము ప్రమాదం; ఆప్రమాదం నుండి రక్షించి తాను ఆమెను పోషిస్తున్నట్లు అనుకొనే వాడు వాసు: తానుచేసే ప్రతీ పనిలోనూ ఏదో త్యాగంచేస్తున్నట్లు నీచ భావాలు పనిచేశాయిఅతనిలో. ఆశయదృష్టిలో తాను పతనమైనాననుకొనేది లలిత. గంటకు బదులు రోజులే తనను విడిచి వుండగల్గుతున్నాడు వాసు — పారుగునున్న

సత్యవతి స్నేహం ఇప్పుడు అవసరమైంది. ఆమె దృష్టిలో లలిత ఎంత విద్యావతి గానీ; ఎలాంటి ఆశయాలుండనీ పతిత ... సత్యవతిమాటల్లో ఆమె తన్ను సంఘం ఎలా చూస్తుందో తెలుసుకొని విచారించింది — వాసు ప్రేమలో ... ఆకర్షణీయమైన మాటల్లో నిజం లేదన్నమాట ... అయితే అతను ఇప్పుడు మరొక అమ్మాయికోసం వేటాడుతున్నాడా?

లలిత ఇంకా ఏడుస్తునే ఉంది... లత కన్నీళ్లను తుడిచి... సెలవు పుచ్చుకొంది...లత.

తర్వాత ఏమయిందో మనకు తెలియదు... కాని సుమారు ఒక ఏడాదిలో ఒక లేఖను లత అందుకొంది...అదే లలితచేతి ఆఖరు లేఖ... ఊహించుకొన్నది లత కథను... లలితలో ఎంత విజ్ఞానమున్నా... ప్రకృతి శక్తులను ఎదుర్కొంది. చాలా నాళ్లుగా చూచి ఒక్కసారి, అపజయాన్ని అంగీకరించింది. ఆమె సుందరదేహం, తపించిపోయిన సుఖంకోసం—, ఒక్కసారిగా ఆమె ఆశయాలను జయించింది— ఆ సుఖంలో ఆ అనుభవంలో ఆమె విజ్ఞానం మూలకుముడుచుకొంది—. వాసు ప్రకృతి తనకు తెలుసు. అతనిలో ఈమె సౌందర్యం, చాలనాళ్లుగా నిలిచి, తర్వాత మాసిపోయింది— నిత్య నూత్నంగా తయారుకావలసిన లలిత అమాయికంగా కనపడే వాసుమాటల్లో, ప్రేమగురించి అతనినుంచి వచ్చే ఉపన్యాసాలలో—విశ్వసించి పాతబడిపోయింది—.

లలిత ఆఖరు లేఖను సంజెచీకట్లలో మళ్ళీ చదువుకొంది లత.

“సోదరి లతకు...

నా ఆశయాలు—, వంచనకు గురి అయినాయి. నేను పతనమైనాను ... నన్ను వాసు పూర్తిగా వదులుకొన్నాడు... లేక నేనే అతన్ని...? నా ఎప్పటి ఉద్యోగానికే వెళ్తున్నా...

వాసుకు నామీద వుదయించింది. ప్రేమకాదు. సౌందర్య పిపాసకాదు - ఈ 24 ఏళ్లూ సౌష్టవంగా పెరిగిన నా శరీరంపై కామం, వాంఛ... 'నారూపం పాతబడిందని' 'నావల్ల వాసుకి విసుగు కల్గుతుందని' నేను గుర్తించేప్పటికే చేతులు కాలినాయి. ఈ వాంఛ అతనిలో ఎంత త్వరగా సన్నగిలింది! మొదట ప్రసరించిన వుజ్వలకాంతి చల్లగా నల్లగా ఎంత త్వరలో మాయమైంది! పెళ్లిచేసుకోలేదుగా ... వచ్చేశా. కాని నేను రాకముందే ఓ అమ్మాయి ఆ గృహాన్ని మంగళసూత్రంతో చేరుకొంది. నాకు అర్థమైంది...పాపం ఆ అమ్మాయి అనూయచూస్తే జాలేసింది...అబ్బాయికోసమైనా బ్రతకాలనుకుంటూ...కాని... ఈ దుస్వప్నం వాడితోనే స్మృతికొస్తుంది. ఈ షాక్ భరించలేనసుకొంటూ ... అబ్బాయి భారం నీదే అవుతుంది త్వరలో బహుశా...”

ఈసారి లత ముఖంలో స్పష్టంగా దుఃఖం—జాలి కనబడ్డాయి...